కృష్ణా కాలువ ప్రక్షాళనకు స్పెషల్‌ డ్రైవ్‌

- నగర పరిధిలోని కాలువలో భారీగా పేరుకున్న చెత్త, వ్యర్థాలు
- పారిశుద్ధ్య కార్మికులతో ముమ్మరంగా తొలగింపు పనులు

ఏలూరు టౌన్‌ : నగరంలోని కృష్ణా కాలువ ప్రక్షాళనకు కార్పొరేషన్‌ అధికారులు నడుంబిగించారు. దీనిలో భాగంగా కాలువలో వ్యర్థాలు, చెత్తను తొలగింపు పనులను స్పెషల్‌ డ్రైవ్‌గా చేపట్టారు. వందలాది మంది పారిశుద్ధ్య కార్మికులతో ఏలూరు తూర్పులాకుల నుంచి మినీబైపాస్‌ గ్రీన్‌ సిటీ వరకూ ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకున్నారు. గత మూడు రోజులుగా కృష్ణకాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించేందుకు పెద్దెత్తున కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కార్మికులు కాలువ గట్టుపైనా, కాలువలోనూ పేరుకుపోయిన ప్లాస్టిక్‌ వ్యర్థాలను ఏరిపారవేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. కాలువలో, గట్లపై చెత్త, వ్యర్థాల తొలగింపు పనులను మునిసిపల్‌ కమిషనర్‌ వెంకటకృష్ణ గురువారం పరిశీలించారు.

గట్టుపైనా చెత్త, వ్యర్థాల తొలగింపు

కృష్ణకాలువను గతంలో ప్రక్షాళన చేశారు. పెద్దెత్తున పొక్లెయిన్లు, ట్రాక్టర్లను ఉపయోగించి కాలువలోని వ్యర్థాలను తొలగించే పనిని చేశారు. భారీగా నిధులు సైతం ఖర్చు చేశారు. కానీ ఆరు నెలలు తిరగకముందే కృష్ణకాలువ ప్లాస్టిక్‌ వ్యర్థాలు, చెత్తా చెదారంతో పేరుకుపోయింది. కాలువ గట్టుపై పూడిక తీసి వేయటంతో గట్టు అంతా వ్యర్థాలతో నిండిపోయింది. యథావిధిగా నగరంలోని వ్యాపారులు, ప్రజలు వ్యర్థాలు పడవేస్తుండటంతో కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఈ నేపథ్యంలో ఇటీవల నగర కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంక్రాంతి వెంకటకృష్ణ కృష్ణా కాలువను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టారు.



ఏలూరు కర్రవంతెన వద్ద కృష్ణా కాలువ గట్లను శుభ్రం చేస్తున్న కార్మికులు, పరిశీలిస్తున్న నగర కమిషనర్‌ వెంకటకృష్ణ



పాతబస్టాండ్‌ నుంచి తూర్పులాకుల ప్రాంతంలో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

క్లీన్‌ ఏలూరు లక్ష్యం

నగరంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నగరం నడిబొడ్డున ఉన్న కృష్ణకాలువ చెత్త, చెదారం, ప్లాస్టిక్‌ వ్యర్థాలతో నిండిపోయింది. ఈ పరిస్థితుల్లో కాలువను పరిశుభ్రంగా ఉంచాలని, క్లీన్‌ ఏలూరు లక్ష్యంగా స్పెషల్‌ డ్రైవ్‌ చేపడుతున్నాం. ప్రజలకు మెరుగైన, మంచి వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. వ్యాపారులు, నగర ప్రజలు సహకరిస్తే క్లీన్‌ ఏలూరు సాధ్యమవుతుంది. ఇప్పటికే నగరంలో కాలువ గట్టు వెంబడి చిరు వ్యాపారులకు అవగాహన కల్పించాం. కాలువలో వ్యర్థాలు వేయకుండా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నాం. ప్రజలు సైతం సహకరిస్తే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

– సంక్రాంతి వెంకటకృష్ణ, నగర కమిషనర్‌

క్లుప్తంగా

ఎంఈవో కార్యాలయం ఆకస్మిక తనిఖీ



ఏలూరులో ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ రవిసాగర్‌

ఏలూరు రూరల్‌ : ఏలూరు మండల విద్యాశాఖ కార్యాలయాలన్ని గురువారం డీఈఓ ఎస్వీ రవి సాగర్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి సమక్షంలో ఎకడమిక్‌, నాన్‌ ఎకడమిక్‌ రికార్డులతో పాటు బైజ్యూస్‌ ట్యాబ్‌ రికార్డులు పరిశీలించారు. రివాల్వింగ్‌ ఫండ్‌ ఖర్చుకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా చేపట్టిన నాడు–నేడు, జగనన్న గోరుముద్దతో పాటు పిల్లలకు యూనిఫాం, బూట్లు, పుస్తకాలు పంపిణీ కార్యక్రమాలు పక్కాగా అమలు చేయడమే విద్యాశాఖ లక్ష్యం అన్నారు. అర్హత కల్గిన ప్రతి ఒక్క విద్యార్థికి ప్రభుత్వం చేపట్టిన పథకాలు అందాలన్నారు. పాఠశాల స్థాయిలో విద్యాశాఖ పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత మండలధికారిదే అన్నారు. రికార్డులు మెయింటెన్స్‌, పథకాలు అమలు బాగుందని ఎంఈఓతో పాటు సిబ్బందిని అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓ రవిసాగర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీటీఏ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్స్‌ అసోసియేషన్‌ జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవి సాగర్‌ను కోరారు. గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు వివిధ ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై రవి సాగర్‌ స్పందిస్తూ తన పరిధిలో ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని, రాష్ట్ర స్థాయి సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రవిసాగర్‌కు బీటీఏ నాయకులు పుష్పగుచ్ఛాలు అందచేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలువూరి విద్యాసాగర్‌, జిల్లా అధ్యక్షుడు భాష్యం వేణుబాబు, ప్రధాన కార్యదర్శి వాసే అమృతరావు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ డీవీ సుబ్బారావు, ఆడమిల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కుట్రలు చేసినా.. టీడీపీ గెలుపు అసాధ్యం

- సీఎం జగనన్నపై ప్రజలు, నేతల్లో పెరిగిన ఆదరణ
- రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్‌ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి



ఏలూరు టౌన్‌: ప్రజా బలం లేని టీడీపీ, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా గెలుపు సాధ్యం కాదని, 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబుకు కనీసం తమ అభ్యర్థుల పేర్లను కూడా చెప్పుకోలేని స్థితిలోకి వెళ్లారని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్‌ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకున్న నేపథ్యంలో నూతనంగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కవురు శ్రీనివాస్‌, వంకా రవీంద్రనాథ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరులో ఆమె మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల్లో కనీసం అభ్యర్థులను నిలబెట్టుకునే దమ్ము లేదనీ, ఇండిపెండెంట్‌గా పెట్టుకుని వారితో కుట్రలు చేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయని విమర్శించారు. చేతకాని టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎవకూ మద్దతు ఇవ్వటంలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని, రాబోయే ఏ ఎన్నికలైనా విజయం మాత్రం వైఎస్సార్‌ సీపీదేనని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సామాజిక సమతుల్యతకు పెద్దపీట వేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, చైర్మన్‌, సర్పంచ్‌ ఇలా పదవి ఏదైనా బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కలిప్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్నలోని దార్శనికతకు నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్సీల్లో బీసీలకు అగ్రభాగం ఇవ్వటమేనని, రాబోయే కాలంలో బీసీలంతా ఆయనకు అండగా నిలుస్తారని, గతంలో చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేశారని విమర్శించారు.

పోలీస్‌ కుటుంబాలకు అండగా ఉంటాం

- ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌ శర్మ
- బాధితులకు ఆర్థిక సహాయం అందజేత



ఓ మహిళకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌ శర్మ, చిత్రంలో పోలీస్‌ అధికారుల సంఘం నాయకులు

ఏలూరు టౌన్‌: ఏలూరు జిల్లాలోని పోలీస్‌ సిబ్బంది, వారి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌ శర్మ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయంలో గురువారం అనారోగ్యంతో మృతిచెందిన పోలీస్‌ సిబ్బంది కుటుంబాలకు జిల్లా ఎస్పీ చేతులమీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఏఆర్‌ ఎస్‌ఐ అంబటి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆయన సతీమణికి సంక్షేమ నిధి నుంచి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌ శాఖలో అంకితభావంతో పనిచేసే సిబ్బంది మరణించటం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు పోలీస్‌ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పోలీసు కుటుంబంలోని ఎవరికైనా సమస్య వస్తే తక్షణమే స్పందించి సహాయం అందిస్తామని భరోసా కల్పించారు. ప్రభుత్వం నుంచీ రావాల్సిన రాయితీలను త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. పోలీస్‌ ప్రధాన కార్యాలయ సిబ్బంది, రాష్ట్ర పోలీస్‌ అధికారుల సంఘం సెక్రటరీ బందారు యేసుబాబు (నాని), హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీకాంత్‌, వేణు, మహిళా హెడ్‌ కానిస్టేబుల్‌ రత్నకుమారి, పోలీస్‌ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్‌.నాగేశ్వరరావు ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట

ఏలూరు (టూటౌన్‌): సంక్షేమానికి పెద్దపీట వేసేలా సుపరిపాలనే ధ్యేయంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ ఉందంటూ పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యతో భావితరాల భవితకు బాటలు వేసే విధంగా వైద్యంతో పేదలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ బడ్జెట్‌ ఉందని చెబుతున్నారు. 2023–24 బడ్జెట్‌ అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టినట్లు ఉందని చెబుతున్నారు. బీసీలకు కేటాయింపుల్లో 32.5 శాతం పెరుగుదల ఉండటం, సంక్షేమ పథకాల కేటాయింపుల్లో గతేడాది కన్నా 10 శాతం అధికంగా నిధులు కేటాయించడంపై ఆయా వర్గాల నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

బడ్జెట్‌లో బీసీలకు అధిక ప్రాధాన్యత



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించినట్లుగా ఉంది. 2022–23 బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.29,143 కోట్లు కేటాయించగా, 2023–24 బడ్జెట్‌లో రూ.38,605 కోట్లు కేటాయించడం అభినందనీయం. గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే ఈ సారి బడ్జెట్‌ల్లో బీసీల సంక్షేమానికి 33.5 శాతం అధికంగా నిధులు కేటాయింపులు చేయడం హర్షణీయం. బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– లక్కోజు రాజగోపాలాచారి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ డైరెక్టర్‌

సంక్షేమానికి 10 శాతం అదనంగా కేటాయింపులు



ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయం మరోసారి రుజువైంది. గతేడాది కన్నా ఈ ఏడాది కేటాయింపుల్లో 10 శాతం పెరుగుదల ఉండటమే దీనికి ఉదాహరణ. గతేడాది బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు రూ.48,882 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.54,228 కోట్లు కేటాయింపులు చేయడం అభినందనీయం.

– అబ్బిరెడ్డి రంగముత్యాలు, తూర్పుకాపు సంఘం నాయకులు, ఏలూరు

'కార్పెంటర్స్‌' నేత వెంకటరమణ ఆకస్మిక మృతి



కెల్ల వెంకటరమణ (ఫైల్‌)

ఏలూరు (టూటౌన్‌): ఏలూరు పట్టణ కార్పెంటర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు, విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కెల్ల వెంకటరమణ (52) ఆకస్మిక మృతికి నగరంలోని పలు సంఘాల నాయకులు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు. వెంకటరమణ బుధవారం రాత్రి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో నెహ్రూ కాలనీలోని స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. నగరంలోని కార్పెంటర్లు, విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరాయంగా కృషి చేసినట్లు ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఆయన మృతికి నాయకులు ఎ.శివకేశవరావు, మారీదుపూడి వీరభద్రాచార్యులు, వేముల దుర్గాప్రసాద్‌, కేకేఎస్‌ రాంబాబు, గూడూరు హేమదుర్గాప్రసాద్‌, ఏపీవిశ్వబ్రాహ్మణ వెల్ఫేర్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ లక్కోజి గోపి సంతాపం తెలిపారు. వెంకటరమణ మృతికి సీఐటీయూ జిల్లా నాయకులు చింతకాయల బాబురావు, ఏవీఆర్‌ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నర్సింహరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్‌ పిచ్చుక ఆదిశేషు, వడ్రం పనివార్ల సంఘం రాష్ట్ర కోశాధికారి వేముల దుర్గాప్రసాద్‌, ఏలూరు కార్యదర్శి కొత్తల శివకుమార్‌ సంతాపం తెలియచేశారు. వెంకటరమణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

స్పెషల్‌ టీచర్లు అంకితభావంతో పనిచేయాలి



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న డీఈఓ రవిసాగర్‌

ఏలూరు రూరల్‌ : దివ్యాంగులకు అంకితభావంతో విద్యాబుద్ధులు నేర్పాలని డీఈఓ ఎస్వీ రవిసాగర్‌ అన్నారు. గురువారం దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్‌, టెక్నికల్‌ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వ ఉద్యోగికి దక్కని గౌరవం, ఆత్మ సంతృప్తి ప్రత్యేక ఉపాధ్యాయులకు దక్కుతోందన్నారు. దివ్యాంగులకు పాఠాలు నేర్పడం కష్టంతో కూడుకున్నదని, ఓర్పు, సహనంతో పాటు ప్రేమ, అభిమానంతో దివ్యాంగులకు పాఠాలు నేర్పాల్సి ఉందన్నారు. సాధారణ విద్యార్థుల వలె దివ్యాంగుల్లో సైతం ఎంతో నైపుణ్యం, శక్తి, సామర్థ్యాలు దాగి ఉంటాయన్నారు. శిక్షణ ద్వారా వారిలో నైపుణ్యం వెలికి తీయాలన్నారు. మరింత తోడ్పాటు అందిస్తే దివ్యాంగులు సైతం ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్‌ ఎన్‌.సీతారామకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కలగాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు దివ్యాంగులకు విద్యాబుద్ధులతో పాటు ఉద్యోగ, ఉపాధి, మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు. పరివర్తన స్కూల్‌ ప్రిన్సిపాల్‌ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం బధిరుల పాఠశాల ఏర్పాటు చేశామన్నారు. అధికారుల సహకారం, దాతల చేయూతతో ఎందరో బధిరులను విద్యావంతులుగా తీర్చిదిద్దామన్నారు. బధిరుల కోసం ఎడ్యుకేషనల్‌ సొసైటీ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులతో పాటు యువతీ యువకులకు శిక్షణ అందించామన్నారు. అనంతరం డీఈఓ చేతుల మీదుగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బి.ప్రసాదబాబు, లక్ష్మీరావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌ మృతి

ఏలూరు టౌన్‌: ఏలూరు – కైకలూరు రహదారిలో శ్రీపర్రు కాజ్‌వే వద్ద ఆటో బోల్తా కొట్టిన సంఘటనలో డ్రైవర్‌ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మాదేపల్లి ఇందిరా కాలనీకి చెందిన కాల్వ ఆంజనేయులు (45) ఆటో నడపటం, పాత ఐరన్‌ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఆంజనేయులు గురువారం ఆటో వేసుకుని శ్రీపర్రు వైపు వెళుతూ కాజ్‌వే దాటుతుండగా గుంతలో పడి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు కిందపడి పోగా అతనిపై ఆటో పడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఏలూరు రూరల్‌ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు బోధనాసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48–70
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	08–10
బెండకాయలు	44	కంద	46
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్‌	36
కాకర కాయలు	40–44	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్‌	76
బీరకాయలు (పందిరి)	54	అల్లం	80
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్‌	30	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	30–46	బఠాణీ	76
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్‌	72
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు –ఈసీఐఎల్‌	22.30	4814	19
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌	22.15	34820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌	09.00	4794	29
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

సీనియర్‌ ఉపాధ్యాయుడు ఈడేకు సత్కారం



ఈడే శివశంకరరావుకు జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సాబ్జీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో వేలాది మంది ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్సీ షేక్‌ సాబ్జీ తెలిపారు. గురువారం స్థానిక యూటీఎఫ్‌ జిల్లా కార్యాలయంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ ఏలూరు నగర శాఖ తొలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాబ్జీ మాట్లాడుతూ వృత్తి పరంగా ఆత్మ సంతృప్తి అధికంగా లభించేది ఉపాధ్యాయులకేనని, సమాజంలో గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిటీని వెంటనే వెయ్యాలని, 11వ పీఆర్‌సీ బకాయిలు త్వరితగతిన చెల్లించాలని కోరారు. డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, బడ్జెట్‌లో విద్యకు ఎక్కువ నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తిలో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈడే శివశంకరరావుకు సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు. యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.రవికుమార్‌, సహాధ్యక్షురాలు సుభాషిణి, కోశాధికారి ముస్తఫాలీ, నాయకులు జె.రాజారావు, ఎండీ జక్రియ, కేవీ అప్పారావు, ఎం.చిట్టిబాబు, సీహెచ్‌ షణ్ముఖి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థల సేవలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జీ రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్‌): న్యాయసేవాధికార సంస్థలు అందించే సేవలు, కార్యకలాపాలపై ఏలూరు పరిధిలోని ఎన్‌జీవోలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జీ.రాజేశ్వరి, శాశ్వత ప్రజా న్యాయపీఠం చైర్‌పర్సన్‌ ఏ.మేరీగ్రేస్‌ కుమారి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలకు గురైన వారికి, మానవ అక్రమ రవాణా నివారణ, అసంఘటిత కార్మికులకు, బాలల సంరక్షణ, సంక్షేమం, మానసిక వికలాంగుల న్యాయ సహాయం, గిరిజనుల హక్కులపైన, మాదకద్రవ్యాల నిరోధంపైన, యాసిడ్‌ బాధితుల న్యాయసహాయంపై సదస్సుకు హాజరైనటువంటి ఎన్‌జీవోలకు లీగల్‌ సర్వీసెస్‌ అందించే సహాయంపై అవగాహన కల్పించారు. పర్మినెంట్‌ లోక్‌అదాలత్‌ చైర్‌పర్సన్‌ ఎ.మేరీగ్రేస్‌ కుమారి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నూతనంగా శాశ్వత లోక్‌అదాలత్‌ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్‌అదాలత్‌ద్వారా పరిష్కారమయ్యే సమస్యలపై, పనిచేసే విధానాలను ఎన్‌జీవోలకు వివరించారు. ఈ నెల 18న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కుటుంబ వివాదాలు, వినియోగదారుల ఫోరానికి సంబంధించిన, ఐపీఆర్‌ కేసులపై ప్రత్యేక లోక్‌అదాలత్‌ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

దెందులూరు : పోతునూరు పీహెచ్‌సీని గురువారం డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్‌ ఆశ ఆకస్మిక తనిఖీ చేశారు. మందులు, తాగునీరు, శానిటేషన్‌, వైద్యశాల, రికార్డులు, పరికరాలు పరిశీలించారు. ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెందులూరు మండలంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సాయంత్రం నుంచి ఉదయం 10 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండకపోవడంపై జిల్లా, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి ఈ తనిఖీలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.